ఆమె తల వంచింది

"ఏమండోయ్. ఇవాళ మా అమ్మ జీడిపలుకులు వేసిన ఉప్మాచేసి మా టిఫిన్ డబ్బాలలో పెట్టింది. అన్నంలోకి కొబ్బరి పచ్చడి చేసింది." ఒక చిన్న స్టూలు గోడదగ్గరగా వేసుకుని దానిమీద నిలబడి అవతలభాగంలో పంపు దగ్గర ముఖం కడుక్కుంటున్న ఆయనతో అంటున్నాడు శ్రీరామ్.

"ఆఁ హాఁ! ఎంత అదృష్టం ఎంత అదృష్టం! అప్పుడే నీకు స్కూలుకు వేళయిందేమిటి?" అంటున్నాడు శ్యామలరావు నోట్లో బ్రష్ పెట్టుకుని

"అప్పుడే ఏమిటండోయ్? తొమ్మిది కావచ్చింది. మా తమ్ముడూ నేనూ భోజనంచేశాం. స్కూలుకు వెళ్ళుతున్నాం. టా టా."

నవ్వుకున్నాడు శ్యామలరావు.

రామవిలాస్‌లో మూడు అంతస్తులలోనూ కలిపి పన్నెండు భాగాలున్నాయి అవి రెండేసి గదులూ ఒక చిన్న వరెండాగల క్వార్టర్సు. ఒక క్వార్టర్‌కు మరొక దానికి మధ్యగా మనిషిఎత్తు గోడలు ఉన్నాయి ఒకరికొకరు కనబడకుండా. అవి కడుతూ ఉండగానే ఏభయి రూపాయల అడ్వాన్సు ఇచ్చింది వైదేహి. ఆమెది ఎనిమిదవ నెంబరు క్వార్టర్సు. ఆ రెండు నెలలలోనే తయారయిన తన భాగంలోకి ఐదేళ్ళ కొడుకు ఆరు నెలల కడుపుతో వచ్చి చేరింది. ఆమె అక్కడ చేరేటప్పటికి బి. ఇడి ట్రైనింగ్‌లో ఉంది. ఆ సమీపంలో ఉన్న చిన్న స్కూల్లో ఐదేళ్ళ శ్రీరామ్ చదువుకుంటున్నాడు.

ట్రైనింగ్ కాగానే ఆమె శ్రీరామ్‌కు ఇంట్లోనే చదువు చెప్పటం మొదలు పెట్టింది. ఆమె లెక్కలు కట్టింది. తన రిజల్టు వచ్చేసరికి పురుడు వచ్చేస్తుంది తను గవర్నమెంటు స్కూల్లోకే దరఖాస్తు పెడుతుంది. తనకు ఉద్యోగం వచ్చే లోగా శ్రీరామ్‌ను పై క్లాసులో వేసేటందుకు వీలుగా తయారు చేస్తోంది.

ఇవన్నీ తననుకున్నట్లు జరిగితే ఎంత బాగుంటుంది ?

తనకు ఏ అర్ధరాత్రో నొప్పులు వస్తే హాస్పిటల్‌కు ఎవరు తీసుకు వెళ్తారు ?

అయ్యో ! తన శ్రీరామ్‌ను ఎవరు చూస్తారు తను హాస్పిటల్‌నుంచి ఇంటికి వచ్చేవరకు ?

రెండు రోజులపాటు దీర్ఘంగా ఆలోచిస్తూనే ఉంది.

తన చిన్ననాటి స్నేహితురాలే గవర్నమెంటు పురుళ్ళ ఆస్పత్రిలో పనిచేసే డాక్టరు. ఎందుకో ఆమె దగ్గరికి వెళ్ళబుద్ధి కాలేదు వైదేహికి. కొత్తచోట తనకు తెలియని కొత్త డాక్టరికి చూపించుకుంది మందులు రాయించి తెచ్చుకుంది. పురుడు వచ్చే తేదికూడా రాయించి తెచ్చుకుంది.

అప్పటికి పదిరోజులుందని రాసింది డాక్టరు ఈ లోపల వచ్చినా రావచ్చు పురుడు. రెండు రోజులు దాటినా దాటవచ్చు.

శ్రీరామ్ చిన్నప్పుడు ఎవరు పిలిచినా వెళ్ళేవాడు. జనముద్దుబిడ్డ కావటం వల్ల ట్రైనింగ్ కాలేజిలో ఉన్న టీచరు శ్రీరామ్‌ను తన ఇంటికి తరచుగా తీసుకు వెళ్లుతూ ఉండేది. వైదేహి సంయుక్త మంచి స్నేహితులు. వైదేహిని ట్రైనింగ్ కాలేజిలో చేరమని సలహా ఇచ్చింది కూడా సంయుక్తే. సంయుక్తను వైదేహి మరిచిపోవటం అంటూ ఉండదు. ఈ సమయంలో కూడా ఆదుకోవలసినది, సంయుక్తేనని మనసు శాంతపరచుకుంది వైదేహి.

వేళగానివేళ ఆయాసపడుతూ పిల్లవాడిని చెయ్యిపట్టుకుని తీసుకు వచ్చిన వైదేహిని ఆశ్చర్యంతో చూపింది సంయుక్త.

"ఏమిటిలా వచ్చావు ఈ వేళప్పుడు?" శ్రీరామ్‌ను అందుకుంది సంయుక్త.

"వీడు నీదగ్గర బాగా అలవాటు కదా. నీదగ్గర నీ పిల్లలతోపాటుగా ఉంచు కుంటావా సంయుక్తా?" తల వంచుకుని అడిగింది వైదేహి

ఆమె నిండు గర్భాన్ని చూస్తూ తల పంకించింది సంయుక్త. "డాక్టరు దగ్గరికి వెళ్ళి చూపించుకున్నావా ? ట్రైమెప్పుడట ?"

''ఇంకో పదిరోజులు సుమారు లెక్క ''

''నేనే ఆమాట అందామనుకున్నాను శ్రీరామ్‌ను నా దగ్గర ఉంచేసి వెళ్ళు వాడి బట్టలు పక్కచుట్ట నేను తెప్పించుకుంటాను ఎవరిచేతనైనా. మరి నీ వొక్క దానవు. అయిపోతావు ఇల్లుకూడా చాలా దూరంగా తీసుకున్నావు'' అంది సంయుక్త శ్రీరామ్‌ని ఒళ్లో కూర్చోబెట్టుకుంటూ

''ఏం చెయ్యను ? ఆ ఫ్లాట్సు విడిగా ఎవరి భాగాలు వాళ్ళకు ప్రత్యేకంగా ఉన్నాయి మన ఇంట్లో మనము తలుపులు వేసుకున్నప్పటికీ సందడిగా ఉంటుంది భయమనిపించదు అవసరమై వచ్చి పిలిస్తే ఎవరయినా పలుకుతారు ఒంటరి వాళ్ళకు అటువంటివే మంచివనిపించింది '

''అయితే నీవు హాస్పిటల్లో చేరినట్టు ఎట్లా తెలుస్తుంది నాకు ?''

'ఉత్తరం రాస్తాను మా రామవిలాస్‌లో క్రిందిభాగంలో ఒక గృహిణితో పరిచయమయింది ఆమె సహాయంతో హాస్పిటల్‌కు వెళ్తాను. ఇప్పుడు హాస్పిటల్సులో వారం లోపలే ఇంటికి పంపేస్తున్నారు. తరువాత కొన్నాళ్లు వండి పెట్టటానికి ఒక మనిషిని ఆమె మాట్లాడి పెడతానన్నది.'' వైదేహి తను చేసుకున్న ఏర్పాట్లు చెప్పింది

శ్రీరామ్ అప్పుడే సంయుక్త పిల్లలిద్దరితో కలిసి ఆడుకుంటున్నాడు పక్క గదిలో వాళ్ళను చూడగానే అమ్మను మరిచిపోతాడు. వైదేహి శ్రీరామ్‌ను పిలిచి ''బాబూ ! ఈ ఆంటీ దగ్గర ఉంటావా ? ఈ ఆంటీ చాలా మంచిది వీళ్ళిద్దరూ నీ ఫ్రెండ్సు వీళ్ళతో ఆడుకో '' వైదేహికి కన్నీళ్లు వస్తున్నాయిగాని శ్రీరామ్ చప్పట్లు కొడుతూ ''ఉంటాను ఉంటాను నీవు వెళ్ళిపో'' అంటూ ఎగిరి గంతులు వేశాడు.

''సంయుక్తా'' కడుపులో ఏదో బాధ దానిని పైకి వ్యక్తం చేయలేక పోతోంది కొంగుతో కళ్లు రెండూ గట్టిగా నొక్కుకుంది పైపొంగు తగ్గేవరకు. ''నేను వెళ్తున్నాన'' వెనక్కు తిరిగి చూడకుండా వెళ్లిపోయింది వైదేహి

వారం తిరక్కుండానే గాంధీ హాస్పిటల్లో మగపిల్లవాడిని కన్నది హాస్పిటల్లో ఉన్న వారంరోజులు రామవిలాస్ కిందిభాగంలో ఉన్న గృహిణి చాలా సహాయం చేసింది భోజనంకూడా పంపించింది.

వైదేహి ఇంటికివచ్చిన మరునాడు సంయుక్త శ్రీరామ్‌ను తీసుకువచ్చి అప్పగించింది.

"వైదేహీ! ఇంతవరకూ బాగానే గడిచింది. రేపు ఉద్యోగ వస్తే ఈ పిల్లవాడిని ఎక్కడ ఉంచుతావు?"

"ముందు ప్యాస్‌కానీ తరువాతకదా ఉద్యోగం?"

"నీవు ప్యాసయ్యావు. నేను తెలుసుకున్నాను. నీకు గవర్నమెంటు ఉద్యోగం కావాలా? ప్రయివేటు స్కూల్లో కావాలా?"

"గవర్నమెంటయితే ట్రాన్స్‌ఫర్లు వస్తూఉంటాయి."

"ప్రైవేటు అయితే ట్రాన్స్‌ఫర్లు రావు. ప్రైవేటుదని చులకనగా చూడకు. నీ అర్హతకు తగిన ఉద్యోగమే. జీతంకూడా గవర్నమెంటు స్కూళ్లల్లో ఇచ్చినస్కేలే ఇస్తారు. ఇప్పుడు ఒకస్కూల్లో ఖాళీ ఉంది. దరఖాస్తు పెడతావా?" సంయుక్త అడిగింది వైదేహి రెండవ కొడుకును ఎత్తుకుంటూ.

"పెడతానుగాని ఆర్డరు ఇప్పించే నాధుడు ఉండద్దూ?"

"ఆ నాధుడూ ఉన్నాడు దరఖాస్తు పెట్టు నాకాస్కూలు ప్రిన్సిపల్ బాగా తెలుసు. నేను చెప్పింది కాదనదు. అసలు నన్ను అడిగింది ఎవరయినా బాగా పని చేయ గలిగినవాళ్లు ఉంటే పంపమని"

"అంతకటేనా? అయితే నీ చేత్తోనే ఇప్పించు ఉద్యోగం" వైదేహి కళ్లలో తడి-చూపుల్లో కృతజ్ఞత మెరుస్తున్నాయి.

"మరి పిల్లవాడు?"

"ఆయాను పెట్టుకుంటాను. వెంట తీసుకు వెళ్తాను. శ్రీరామ్‌ను ఆదగ్గర స్కూల్లో చేర్పిస్తాను" కొంచెము ధైర్యాన్ని పుంజుకుంది వైదేహి.

"ఆ స్కూలుకు అనుబంధంగా ఒక ప్రైమరీ స్కూలు ఉంది. ఆ బిల్డింగ్ వెనక్కు ఉంది ప్రైమరీ సెక్షన్. కనుక ఆ ఇబ్బందికూడా లేదు. నీకు అన్నీ చాలా సౌకర్యంగా ఉంటుంది."

"సరే. నీ సలహా నీ చేయూత నా జీవితాన్ని నడిపించాలి. దరఖాస్తు చేత్తో రాయనా ? లేక టైపు చేయించి ఇవ్వనా ?"

"పచ్చి బాలెంత బజార్ల వెంట పరుగెత్తి టైపు ఎట్లా చేయిస్తుంది గాని. ఈ కాగితమ్మీద సంతకంపెట్టి సర్టిఫికెట్స్ ఇవ్వు. ఆర్డర్సు పోస్టులో వస్తాయి. లేక పోతే నేనే తెస్తాను."

పసివాణ్ణి మంచమ్మీద పడుకోబెట్టి సంయుక్త రెండు చేతులూ పట్టుకుని కళ్ళకద్దుకుంది వైదేహి.

అలా ట్రైనింగయి, ఆ ప్రైవేటు స్కూల్లో టీచరుగా పదేళ్ళు పనిచేసి తరువాత ప్రిన్సిపాలయింది వైదేహి. పిల్లలలో పెద్దవాడు ఇంజనీరింగ్ కాలేజీకి వెళ్ళాలన్న ఊహతో మాట్లాడుతూ ఉంటాడు. వైదేహిని శ్రీరామ్ ఎందులో నయినా ప్రయోజకుడయితే చాలునను కుంటుంది. చిన్న కొడుకు శ్రీరామ్ మాదిరిగా మాట్లాడడు, చాలా గంభీరంగా ఉంటాడు.

ఉదయపువేళ పని ఊపిరాడనంతగా ఉంటుంది. గతరాత్రి ఇస్త్రీచేసిన బట్టలు స్నానాలు చెయ్యగానే పిల్లలు వేసుకుంటారు. తల్లి భోజనానకి పిలిచేవరకూ చదువుకుంటారు.

శ్రీరామ్ పన్నెండేళ్ల పిల్లవాడయి ఉండగా పక్కవాటా ఖాళీ అయింది. దాన్లోకి ఎవరో ఒకాయన ఒంటరి మనిషి అద్దెకు వచ్చాడు. ఆయన తొమ్మిది న్నరకు. ఆఫీసుకు వెళ్లేవాడు. ఈలోపల వంటచేసుకుని తిని కాఫీ ఫ్లాస్కులో పోసుకుని ఉంచుకునేవాడు.

రామవిలాస్ ముందర చాలా ఖాళీస్థలం ఉంది. ఆ స్థలానికి నాలుగు ప్రక్కలా ఇటువంటి క్వార్టర్స్ ఉన్నాయి పిల్లలు ఆ స్థలంలో సాయంత్ర కాగానే ఆడుకుంటూ ఉంటారు పిల్లలు ఆడుకుంటే పెద్దవాళ్లుకూడా ఒక ప్రక్కనుండి చూస్తూ ఉంటారు.

"నీవు చాలా బాగా ఆడేవోయ్" బుజమ్మీద చెయ్యేసి తల నిమిరాడు. శ్రీరామ్‌ను-చాలాసేపటినుంచీ అతడిని గమనిస్తున్న ఆయన.

గర్వంగా నవ్వాడు శ్రీరామ్.

"నీకో మంచి ఆట నేర్పిస్తాను వస్తావా?" అన్నాడాయన అతడి బుగ్గలు నిమురుతూ.

"మీ రెక్కడుంటారు? చాలా దూరమయితే నేను రాలేనుమరి" అన్నాడు శ్రీరామ్ ఆలోచనగా.

"నీవెక్కడుంటావు?"

"మేమా అదిగో ఆ రామవిలాస్‌లో ఎనిమిదవ నెంబరు ఇల్లు మాది" శ్రీరామ్.

"అల్లాగా! మాది ఏడవ నెంబరు. అయితే పక్కపక్కనే ఉన్నా మన్న మాట!" ఆశ్చర్యంగా అన్నాడాయన.

"సరేలెండి సాయంకాలం ఆరూ ఏడూ గంటలమధ్య వస్తాను. నేర్పించండి" అన్నాడు ఆశతో శ్రీరామ్.

ప్రతిరోజూ శ్రీరామ్ సాయంత్రం వెళ్లి బాగా చీకటిపడ్డ తరువాత ఇంటికి వస్తుంటే వైదేహి అడిగింది "శ్రీరామ్. ఆడుకోటానికి వెళ్లిన తమ్ముడు అప్పుడే వస్తున్నాడు. నీవు ఇంత ఆలస్యంగా వస్తే ఎప్పుడు చదువుకుంటావు? ఏమిటా తిరగటం?" అన్నది మందలింపు ధోరణిలో.

"అమ్మా. నేను ఎంతోదూరం వెళ్ళటంలేదు. మన పక్కింటాయిన నాకు చదరంగం నేర్పుతున్నారు. నాకా ఆటమీద చాలా ఆసక్తిగా ఉంది. ఎత్తు-దానికి పై ఎత్తు-చాలా ఆలోచించి నేర్పుగా ఆడే ఆట అది. ఒక గంటే గదమ్మా! వచ్చిన తరువాత నేను చదువుకుంటున్నాను కదా" అన్నాడు.

"ఏమి ఆటలురా పెద్దవాళ్ళతో? అయినా ఆయన ఎవరు? మన పక్కింటికి కొత్తగా వచ్చాడా? ఎప్పుడట?"

"ఏమో? ఈ మధ్యనే చూశాను. ఆయనే చెప్పాడు కొత్తగా వచ్చానని. ఆయన చాలా మంచివాడిలా ఉన్నాడమ్మా. నాతో ఎంతో బాగా మాట్లాడుతాడు."

"నాయనా! మనకు ఆటలూ మాటలూ కంటె చదువు ముఖ్యం. అది ముందు చూసుకో" ఆమె ముఖం గంభీరంగా ఉంది.

శ్రీరామ్ ఆలోచించాడు. అమ్మ ఎప్పుడూ ఇట్లా మాట్లాడదే? అనవసరంగా మందలించదే ?

"అమ్మా. నేను పరీక్షలు తప్పకుండా ప్యాసయితేచాలు కదమ్మా నీకు ? నేనెక్కడయినా తప్పితే చెప్పు ?" అన్నాడు హామీ ఇస్తున్నట్టుగా.

శ్రీరామ్‌కు ఆయనమీద రోజుకు రోజుకు అభిమానం హెచ్చుతోంది. ఇంట్లో మంచికూర చేసుకుంటే "ఇది రుచిచూడండి" అంటూ పళ్ళెంలో పెట్టుకుని ఇచ్చి వస్తాడు. ఆయన కేదయినా కావాలంటే ఇంట్లో ఉంటే ఇస్తాడు. లేకపోతే "బజారునుంచి తెచ్చి ఇవ్వనా అండి" అని అడుగుతాడు.

వైదేహికి చుట్టుపక్కల వాళ్ళను పట్టించుకునే స్వభావంలేదు. అవసరం ఉంటేనే తల ఎత్తిచూస్తుంది. లేకపోతేలేదు. ఆ పక్కింటాయనను గురించి శ్రీరామ్ ప్రతిరోజూ ఏదో చెబుతూ ఉంటాడు. పరధ్యానంగా ఊఁ కొడుతూ ఉంటుంది.

ఒకనాడు పొద్దటివేళ మంచి హడావుడిలోఉంది వైదేహి. పిల్లలకు అన్నాలు పెట్టింది. వాళ్లకు టిఫిన్ డబ్బాలు సర్దిపెట్టిగానీ తాను భోజనానికి కూర్చోదు. పళ్లెంముందు కూర్చుని మొదటి ముద్ద నోట్లో పెట్టుకుందో లేదో ఎవరో తలుపు కొట్టారు. దిగ్గున లేచి తలుపుతీసి చెంబుతో గడపలో నిలబడిన వ్యక్తిని చూసి దయ్యాన్ని చూసి జడుసుకున్నట్టుగా జడుసుకుంది.

"పంపు కట్టేశారు. ఆ వేళకు పట్టుకోలేకపోయాను. చెంబెడు మంచినీళ్లిస్తారా ?" అంటూ నిలబడ్డాడు చెంబు చూపిస్తూ.

తటాలున వెనక్కు తిరిగింది. శ్రీరామ్ ఆయనకు మంచినీళ్లిచ్చి పంపాడు.

"ఏమిటిది ? అనుకోని సంఘటన ?" మనసులో గొణుక్కుంటూ మరింత గంభీరంగా మసలుకుంటోంది వైదేహి.

ఋతువులు సంవత్సరాలుగా మారి దొర్లిపోతుంటే శ్రీరామ్ ఇంజనీయర్‌గా డిగ్రీ పుచ్చుకుని పైచదువులకు బ్యాంకులో అప్పు తీసుకుని అమెరికా వెళ్లుతున్నాడు. మనసులో శ్రీరామ్ దూరదేశం వెళ్లుతున్నాడని ఎంతోబాధ-దానిని అణచి

పెట్టుకోవటానికి మరొకబాధ-తను పడుతున్న బాధ పిల్లలు చూడకూడదని ఇంకొక బాధ పదిరోజులకు శ్రీరామ్ వెళ్లిపోతాడనగా మనసునొక శిలగా మార్చుకోటానికి ప్రయత్నించటం మొదలుపెట్టింది వైదేహి. ఆ ప్రయత్నంలో అన్నీ పరాకు-పనులు-పరాకు మాటలు. కొంత సేపటికి తిప్పుకుని ''ఏమిటీ నేనిట్లా పిచ్చిదాన్నయిపోతున్నాను?'' అనుకుంటూ సర్దుకోవటం ఆమెకే ఆశ్చర్యంగా ఉంది. కన్నీళ్లు బిగబట్టుకుని, శ్రీరామ్‌కు అన్ని జాగ్రత్తలూ చెప్పి, ఉత్తరాలు తప్పకుండా వారావి కొకటయినా రాయమని బ్రతిమిలాడి అతడిని విమానం ఎక్కించి వెనక్కు తిరిగి రాబోతూ ఉండగా ఆయన ఎవరిని సాగనంపటానికి వచ్చాడో మరి తమ వెనక నడుస్తున్నాడు.

వైదేహికి దేహము జలదరించింది. గబగబా అడుగులువేస్తూ ఇంటికి బయలుదేరింది కొడుకుతో. దారిపొడుగునా శ్రీరామ్‌నే తలుచుకుంటోంది. అతడి-మాటలూ చేష్టలూ జ్ఞాపకానికి వస్తున్నాయి.

ఇంటికి వచ్చి నిరుత్సాహంగా ఉన్న చిన్న కొడుకు కోసమే భోజనానికి కూర్చుంది.

ముద్ద నోట్లో పెట్టుకోగానే శ్రీరామ్ జ్ఞాపకము మళ్ళీ తగిలింది. కళ్ళల్లో నీటిపొర తేలి యాడింది.

ఒకసారి చిన్న కొడుక్కు జ్వరం పేలిపోతోంది ఇంటికి వచ్చేసరికి. తను డాక్టరు దగ్గరికి తీసుకు వెళ్ళాలంటే జ్వరము వచ్చిన పిల్లవాడు కిందివరకూ నడవ లేడు. తను ఎత్తుకుని తీసుకుపోలేదు. అందుకని శ్రీరామ్‌ను డాక్టర్ని పిలుచుకు రమ్మంది. డాక్టరు వేనక సందులో ఉంటాడు.

శ్రీరామ్ వెళ్ళనని మొండికి వేశాడు.

చివాట్లు పెట్టింది. చివరకు రెండు దెబ్బలు వేసింది.

''చీకట్లో నేను వెళ్ళలేనమ్మా. నాకు భయం.'' కళ్లు తుడుచుకున్నాడు.

''ఎలాగయినా వెళ్ళరా'' అంటూ బలవంతంగా నెట్టింది. అరగంటలో డాక్టరు వచ్చాడు. జ్వరం తగ్గటానికి మాత్రలిచ్చాడు. డాక్టర్ని సాగనంపటానికి

తను మెట్లువరకు వెళ్లితే అతడు అక్కడ తారసిల్లాడు. చప్పున తను వెనక్కి తిరిగింది.

"మొదలు వెళ్లనని మొరాయించావు కదరా. చూడు, డాక్టరుగారు ఇంజక్షనువల్ల వాడికి జ్వరం తగ్గిపోతుంది. హాయిగా నిద్రపోతాడు." అంది శ్రీరామ్‌తో.

"చీకటి కదమ్మా. భయంకదూ?" అన్నాడు.

"ఎట్లాగో వెళ్లి తీసుకువచ్చావుకదా!" అంది పక్క పరుచుకుంటూ.

"ఎట్లా వెళ్లానో తెలుసా? నేను గదిలోనుంచి బైటికి రాగానే 'నేను తోడుగా వస్తాను రా బాబు!, అంటూ మన పక్కింటాయన వచ్చాడు కనుక ధైర్యంగా వెళ్లాను" అన్నాడు.

ఉలికిపడింది వైదేహి.

ఆ రాత్రి శ్రీరామ్‌మీద ఆలోచనలతో అన్నం సహించలేదు. కంటిమీదికి నిద్ర రాలేదు.

మరునాడు ఉదయమే మళ్లీ మామూలు దినచర్య- కడుపులో బెంగ.

చిన్నవాణ్ణి డాక్టరును చేద్దా మనుకుంది. కాని అతడేమిటో సరిగా చదవడు. పట్టుమని చదివితే మార్కులొస్తాయి గానీ చదవడు. శ్రీరామ్ ఉండగా తను చదువుతున్నంతసేపూ తమ్ముడుకూడా బలవంతంగా చదవమనేవాడు తను మేలుకున్నంతసేపూ తమ్ముడుకూడా మేలుకుని ఉండాలని శాసించేవాడు.

శ్రీరామ్ వెళ్లిన సంవత్సరమే వైదేహి చిన్న కొడుకు వేణు పరీక్ష తప్పాడు. తల్లి కన్నీళ్లతో తను పిల్లలకోసం ఎంత కష్టపడుతున్నదీ చెప్పి "వేణూ! నీవు గ్రహించాలి. నీ జీవితంలో ఒక సంవత్సరం వ్యర్థమయిపోయిందని నా బాధ. కాని డబ్బుకు నేను వెనకాడను!" ఇదివరకెప్పుడూ లేనిది, బాధ కొద్దీ కొంచెం కఠినంగానే అంది.

తెల్లవారి లేచేసరికి అతడు లేడు అతడికి మారుగా ఒక చిన్న ఉత్తరం బల్లమీద ఉంది. 'శ్రీరామ్ అంత ప్రయోజకుడైన తరువాత గాని తల్లి ముఖం

చూడననీ - తన కొరకు వ్యర్థప్రయత్నము చేయవద్దనీ' రాశాడు.

వైదేహి కుమిలి కుమిలి ఏడ్చింది వీడు కూడా పైకి రావాలన్న ఉద్దేశ్యంతో కోపము నటించింది తనకు నిజమైన కోపం వస్తుందా వాళ్ళమీద ? తను కోపగిస్తే వాళ్ళనెవరు దగ్గరికి పిలిచి ఆదరంగా మాట్లాడుతారు ?

కొడుకులిద్దరూ ఎవరి దారులు వాళ్లు చూసుకున్నారు

తను ఇంకా ఉద్యోగం చెయ్యాలా ? ఇంకా సంపాదించి ఎవరికి పెట్టాలి ?

తను ఒక్కతే ఇంట్లో కూర్చున్నా గడిచిపోతుంది.

కాలి కూర్చుని ఏం చెయ్యాలి ?

గతాన్ని తవ్వుకుంటూ కుమిలిపోవటమా ?

తను ధైర్యం తెచ్చుకుని ప్రయోజకురాలై సంపాదించి ఇద్దరు కొడుకులను పెద్దవాళ్ళను చేసింది ఇంకా కుమిలి పోవటం ఎందుకు? ఏమిటీ ఈ మనసు ? ఇదివరకు లేనిది ఇప్పుడు నిబ్బరాన్ని కోల్పోతోంది ఏమిటి ? శ్రీరామ్ ఏ వారానికా వారం ఉత్తరాలు రాస్తున్నాడు. వేణు వెళ్ళిన వారానికి ఓ ఉత్తరం వ్రాశాడు. తను ఆర్మీలో చేరిపోయాడట - తనకు ఆ జీవితం చాలా నచ్చిందంటూ.

పిల్లలకు రెక్కలు వచ్చాయి. ఎగిరి పోయారు.

అంతే.

వైదేహి ఉత్సాహాన్ని కోల్పోయినప్పుడల్లా సంయుక్త దగ్గరికి వెళ్ళి బ్యాటరీ చార్జి చేయించుకుంటుంది. ఆమె మాటల్లో చెప్పాలంటే ఉత్సాహాన్ని పుంజుకుంటుంది మళ్ళీ మామూలు జీవితాన్ని నిబ్బరంగా సాగిస్తుంది

నిర్మలంగా నిశ్చలంగా ఉన్న కాసారంలో ఒక రాయి విసురుగా వచ్చి పడ్డది. కాసారంలో అలలు లేచాయి అకస్మాత్తుగా.

ఆరోజు సెలవురోజు. భోజనంచేసి సంయుక్త ఇంటికి వెళ్లాలనుకుంది వైదేహి. పిల్లల కేదయినా స్వీట్స్ చెయ్యాలని స్టౌ దగ్గర కూర్చొని కేక్ తయారుచేస్తోంది. వెంటనే శ్రీరామ్ వేణు జ్ఞాపకం వచ్చారు. తను చేసిన స్వీట్స్

తింటున్నట్టుగా కంటికి కనబడ్డారు. సజల నయనాలతో వాళ్ల ఫోటోలనుచూసుకుని బాగా తుడిచి మళ్లీ బల్లమీద పెట్టుకుంది.

"పిచ్చి బాబులు. మీరు అక్కడ స్వీట్స్ తిన్నా నేను చేసినంత తీపిగా ఉంటుందా?"

గబగబ ఉడికిన కేక్సు ఒక డబ్బాలో పెట్టుకుంది. వంటయిల్లంతా సర్దింది ముందుగదిలోకి వచ్చి బట్టలు మార్చుకుంటుండగా ఏవో మాటలు పెద్దగా వినిపిస్తున్నాయి. అవి పక్కింట్లోంచే వస్తున్నట్లనిపించింది. ఎందుకంటే ఆ లైనులో తమదే చివరిభాగం. వినిపిస్తే పక్కింట్లోనుంచే వినపడాలి.

"నాదగ్గర ఒక్క దమ్మిడీ లేదయ్యా బాబూ!"

"అట్లాఅంటే ఊరుకోను. నాకు చాలా అవసరంగా ఉంది. ఒక్క ఐదు వందలు ఎట్లా గయినా సర్దుబాటుచెయ్యి."

"ఐదు వందలుకాదు. ఐదు పదులుకూడా లేవు. నాకేం వేల జీత మనుకున్నావా? వచ్చినదాంట్లో ఏదో సర్దుకుని బ్రతుకుతున్నా."

"ఏం నిజాయితీపరుడవయ్యా? సరేగాని ఎల్లుండి మళ్లీ వస్తా. తప్పకుండా తయారుగా ఉంచు."

దభాలున తలుపులు తెరుచుకుంటూ విసురుగా వెళ్లిపోయాడు.

వైదేహి తన గదిలో ఉండే ఆ మాటలన్నీ విన్నది. అవి ఏవో సంచలనాన్ని కలిగిస్తున్నాయి. వాటిని విస్తరించాలనుకుంటూ తలుపు తాళమువేసి బయలుదేరింది.

అన్నట్లుగానే పక్కింట్లో ఆమూడోవాడు మళ్ళీ గలభా ప్రారంభమయింది.

"నీవు ఇవ్వకపోతివా చూడు ఏం చేస్తానో?"

"ఏమిటీ నీవు చేసేది? ఏం చెయ్యగలవు?"

"ఏం చెయ్యగలనా?" వికృతమైన నవ్వు రామ విలాసంతా ఊపేసినట్టు వినబడ్డది. "ఏం చెయ్యలేను? నీవు స్త్రీలోలుడవనీ, పక్కింట్లో ఉన్న ప్రిన్సిపల్‌తో అధర్మంగా జీవిస్తున్నాననీ నీ ఆఫీసులో చాటుతాను. నీపై ఆఫీసురుతో

చెప్పేస్తాను. మీ ఇద్దరి పేర్లు గోడలమీద రాయిస్తాను. దానితో నీ ఉద్యోగం ఊడి పోతుంది. నీకు పెంక్షనురాకుండా చేస్తాను.''

''చూడు సుబ్బారావ్. నీ సంగతంతా నా తోటి ఉద్యోగి చేస్తాడు. నీ వెందుకు శ్రమపడుతావుగాని వెళ్ళిరా''

''అట్లాగా ! అట్లాగా ! చూస్తూ ఉండు'' చర్రున దూసుకుంటూ తలుపులు దగ్గరగా వేసి ఉన్న వైదేహి భాగంలోకి వచ్చాడు.

ఆమె దిగ్గున లేచి నిలబడి ''ఏం కావాలి ? ఎవరు మీరు ?'' అంది.

''నాకు రేపటివరకూ వెయ్యి రూపాయలు కావాలి. మీ పక్కింటాయనూ మీరూ కలిపి ఆ పైకం సర్దండి. లేకపోతే..........'' ఇంకా ఏమో అనబో తున్నాడు.

''వెయ్యి రూపాయలా ? మేమిద్దరం కలిసి సర్దాలా ? ఎందుకు ?'' పైకి చాలా గంభీరంగా ప్రశ్నించింది.

''ఎందుకా ? నాకవసరం కనుక.''

''ఇదేమిటి ఈ జులుము ? నేనెవరిననుకుంటున్నారో ? పొరబడలేదు కద ?''

''ఏం పొరబడలేదు. ఆ ప్రైవేటుస్కూల్లో ప్రిన్సిపల్ కదూ? ఆ మాత్రం కనుక్కోకుండానే ఇంతదూరం వచ్చానా ?'' వికటంగా నవ్వాడు.

''అయితే ఇవ్వాలా ? ఇవ్వకపోతే ?'' రెట్టించింది.

''ఇవ్వకపోతేనా ? మీరో కులట అనీ పక్కింటి ఉద్యోగితో అధర్మ జీవితం గడుపుతున్నారని మీ స్కూలు గోడలనిండా రాయిస్తాను. మీ స్కూలు మేనేజి మెంటుతో చెప్పి ఉద్యోగం ఊడపీకిస్తాను.''

''ఇంతకూ మీరెవరు ?'' తడి ఆరిపోయిన గొంతుతో వినిపించబడకుండా ప్రశ్నించింది.

"నేనా? నే నెవరినో చెబుతాగాని- రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా ఇద్దరూ చెరి ఐదువందలూ సిద్ధంగా ఉంచండి వస్తా" విసురుగా వెళ్లిపోయాడు.

ఆమె నిర్ఘాంతపోయింది. చప్పున ఏదో జ్ఞాపకం వచ్చి తలుపు గడియ పెట్టుకుంది. దడ దడ కొట్టుకుంటున్న గుండెను చేత్తో అదుముకుంటూ మంచమ్మీద వాలిపోయింది.

ఈగలభా అంతా శ్యామలరావు-అదే ఆ పక్కింటాయన చేయించటం లేదు కదా?

ఐదేళ్ల పిల్లవాడితో నెలతప్పి వాంతులతో బాధ పడుతున్న తనను వర్షంలో ఇంటినుంచి గెంటివేసిన శ్యామలరావు ఎంతకయినా తెగించగలడు? పుట్టింటి నుంచి డబ్బు తీసుకురమ్మని వేధించటం, కట్టుకున్న భార్యను చీటికీ మాటికీ అనుమానించి చెయ్యిచేసుకున్న శ్యామలరావేకదా ఇతడు? ఇన్నాళ్లకు మళ్లీ తగుదునమ్మా అంటూ తనెక్కడున్నదీ ఆరాలు తీసి తన పక్కవాటాలో చేరాడు. పెద్ద పిల్లవాడిని దగ్గరికి తీసి మాయమాటలు చెప్పి మళ్లీ ఇంట్లో అడుగు పెట్టాలనుకున్న ప్లానుతో పక్కన చేరినట్టున్నాడు.

ఇంకానయం! జరిగినదంతా పిల్లలకు తెలియలేదు. దగ్గర కూర్చోబెట్టుకుని చెప్పాడుకాదు.

ఎట్లా తెలుస్తుంది? ఆ ఉద్రేకంలో- ఆ కోపంలో తన ముఖానఉన్న బొట్టు చెరిపేసి జోరున కురుస్తున్న వర్షంలో బైటికి నెట్టి తలుపులు వేసుకున్నాడే? పిల్లలింతవరకూ తమకు తండ్రి లేడనే అనుకుంటున్నారు.

ఇదంతా తెలిస్తే తనపైన నిందనెయ్యరూ? తను కన్న కొడుకుల ఎదుట సమాధాన మివ్వలేని అపరాధిలా నిలబడటమా?

తన కెవ్వరూ లేరని ఆనాడు బిడ్డను చంకన తీసుకుని జోరున కురిసే వానలో ఇల్లుదాటి బైటికి వచ్చింది. ఒంటరి జీవికి అవసరమైన ధైర్యాన్ని తెచ్చుకుంది. ఇద్దరి బిడ్డలను పెంచి పెద్దవాళ్ళను చెయ్యగల శక్తి సామర్థ్యాలను సంపాదించుకుంది. బిడ్డలకు రెక్కలు వచ్చాయి. జీవితంలో తను నిర్వహించదలచిన బాధ్యతను తలఎత్తుకుని ధైర్యంగా నిర్వహించింది.

ఇంకా తనకేమవసరం?

ఏం భయం?

అయినా మనసెందుకో గుంఝాటనలో పడ్డది. ఆమె రాత్రి నిద్రపోక పోయినా భళ్ళున తెల్లవారింది.

వైదేహి స్నానం చేసింది. మామూలుగా వంట చేసుకుంది. స్కూలుకు వెళ్ళటానికి బ్యాగ్ సర్దుకుంటుండగా సుబ్బారావు దబదబా తలుపులు బాదాడు.

వైదేహి ధైర్యంతో తలుపులు తీసింది.

చొరవగా లోపలికి వచ్చాడు సుబ్బారావు.

ఏమిటన్నట్టు చూసింది వైదేహి.

"ఏమయ్యోయ్ నేను అన్నంతపనీ చేసేవాడినని నీకింకా తెలియనట్లుంది"

అతడి ఏకవచన ప్రయోగం చూస్తే వైదేహికి అసహ్యం వేసింది.

"మీరడిగినంతా ఇవ్వకపోతే ఏం చేస్తారండీ? మాకిద్దరికీ సంబంధం ఉందని గోడలమీద రాయించి ఉద్యోగాలు ఊడపీకిస్తారా? మీకు అసలు సంగతి తెలియదేమో! ఈ శ్యామల రావుగారు నాకు పదిమందిలో తాళికట్టి తలంబ్రాలు పోసిన పెద్దమనిషి. ఆయనతో సంబంధం పెట్టుకోడం ధర్మబద్ధమే కదా! ఇదిగో ఆయన కట్టిన మంగళసూత్రాలు. ఇవి పాతికేళ్ళకిందట కట్టినవి. మా యిద్దరి తల్లిదండ్రుల ఎదుట-బంధుమిత్రుల సమక్షంలో మంగళవాయిద్యాలుమ్రోగుతుండగా తాళికట్టారు. అంటూ గిరుక్కున తిరిగి వంటయింట్లోకి వెళ్లి బొట్టుపెట్టుకుని వచ్చింది.

సుబ్బారావు కిది ఎదురుచూడని సంఘటన. ఇంతవరకూ ఈబ్లాక్ మెయిలు వ్యవహారం బెడిసికొట్టలేదు. పది సంవత్సరాలనుంచీ జయించుకొస్తున్నాడు.

శ్యామలరావు కిటికీలోనుంచి లోపలికి తొంగిచూస్తున్నాడు.

వైదేకిహికి అభిమానం రోషం ముంచుకు వచ్చాయి.

"ఏమండీ? మీరు పదిమందిలో తాళికట్టి ఇప్పుడీ పెద్దమనిషి ఇట్లాఅంటుంటే వింటూ ఊరుకుంటారేం? ఇదిగో పెళ్లిలో పసుపుబట్టలతో తీయించుకున్న ఫొటో.

ఈసాక్ష్యన్నయినా సుబ్బారావుగారు నమ్ముతారా?" వైదేహికి చిరుచెమటలుపట్టాయి! దేహం కంపిస్తోంది. ఇది ఎవరువేసినఎత్తో తెలియకుండా ఉందామెకు.

"ఇదంతానమ్మి-నేను ఇంతటితో ఊరుకుంటాననుకోకండి. మళ్ళీవస్తాను" సుబ్బారావు విసురుగా వెళ్ళాడు.

విడిపోయిన తమ దాంపత్యానికి తిరిగి ఈ సందర్భంలో ఒకగుర్తింపునిచ్చిన వైదేహిని వింతగా చూస్తూ లోపలికి వెళ్లాలా వద్దా అనుకుంటూ గడపకు అటో కాలు ఇటోకాలూపెట్టి ఆలోచనలోపడ్డాడు శ్యామలరావు

('ఆంధ్రభూమి' సచిత్రవారపత్రిక)